

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 53 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 23, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# కరప్షన్ కేర్ ఆఫ్ రిజిస్ట్రేషన్!

చేతులు తడిపితేనే ఫైల్ ముందుకు..

ప్రజాధనాన్ని పీలుస్తూ... ప్రభుత్వ ఆదాయనికి గండి..

సొమ్మొక్కడిది... సోకొకడిది..

చట్టం పేరుతో దోపిడీ దొంగలు..

పౌర సేవలన్నీ పైసలకే...

అవినీతికి అడ్డాగా మారుతున్న ఎస్ఆర్ఓస్‌లు

దోచుకుంటాం... మళ్ళీ మేమే ఉంటాం..

డాక్టర్, బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారుతున్నాయి. ఈ ఆరోపణలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. 'లంచం లేకుండా పని కాదు' అన్న మాట అక్కడ సాధారణంగా మారింది. ఒకవైపు ఏసీబీ అధికారులు వరుస దాడులు చేస్తున్నా.. మరోవైపు అధికారులు,దళారుల అవినీతిలో ఏ మాత్రం తగ్గడం లేదు. రాష్ట్ర రాజధాని,సరిహద్దుల్లో ఉన్న రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి,వనస్థలిపురం, గండిపేట, సరూర్‌నగర్, హయత్‌నగర్, గచ్చిబౌలి వంటి కీలక సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగిన ఏసీబీ దాడులు వ్యవస్థలోని దుర్వినియోగాన్ని బట్టబయలు చేశాయి. అయినా వేటు పడితే మాకేంటి అన్నట్లుగా అవినీతి వలయ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

**డాక్యుమెంట్‌కో రేటు.. లంచానికి ధర పట్టిక!**

ప్రతి డాక్యుమెంట్‌కు ఓ ఫిక్స్‌డ్ రేటు నిర్ణయించి మరీ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కొందరు సబ్‌రిజిస్ట్రార్లు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై దళారుల వ్యవస్థను నడుపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యుడు నేరుగా కార్యాలయానికి వెళ్తే ఫైల్‌లో లోపాలు చూపిస్తూ ఆలస్యం చేస్తున్నారని, అదే దళారి ద్వారా వెళ్తే గంటల్లో పని పూర్తవుతుందన్న సదరు వ్యక్తులు ఆందోళన చెందుతున్నారు.

**నిషేధిత భూములకూ రిజిస్ట్రేషన్లు?**

ఇది మరింత ఆందోళన కలిగించే అంశం. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాలు, పార్కు స్థలాలు, ప్రభుత్వ భూములు కూడా

- మిగతా 2లో..

## మున్సి పోల్ కీ రెడీ..

నువ్వా నేనా అంటూ పోటీ కి సిద్దమవుతున్న నాయకులు

బ్యాలెట్ పేపర్‌తోనే రాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు

75 గుర్తులతో ఉత్తర్వులు జారీ


ఫిబ్రవరి 15లోపు ప్రక్రియ పూర్తి




3

## కర్ణాటకలో 60 ఏళ్లు పైబడిన జర్నలిస్టులకు చికిత్సపై 75% తగ్గింపు

సీనియర్ జర్నలిస్టులకు యశస్విని మరియు పెన్షన్ ప్రయోజనాలను సరళీకృతం చేయనున్న ప్రభుత్వం





3

## దేశం కోసం ప్రశ్నిస్తున్నాడు

4

## మా మీద భారీగా పన్నులు వేయండి

దావోస్‌కు హాజరైన దేశాల అధినేతలను ఉద్దేశించి 24 దేశాలకు చెందిన 400 మంది సం'పన్ను'ల లేఖ




4



## దొరికినప్పుడే దోచేస్తాం..!

ఫీజు రూ. 90 వేలు, కట్టాల్సింది రూ. లక్ష.20 వేలు.

అడ్మిషన్ల పేరుతో నాటకాలు-ఫీజుల వసూళ్లకు నరకయాతనలు

హోమ్ సిక్ హాలిడే పేరుతో ఫీజుల వసూళ్లకు విద్యార్థులను ఇంటికి..

ఫీజు కట్టలేదని ప్రాక్టికల్స్‌కు అనుమతి నిరాకరణ..

విద్యార్థులకు అన్నం కూడా లేకుండా వేధింపులు

3

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు... డిస్కౌంట్ కూడా ఉంది!

**మేడారం జాతర భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు ప్రారంభం**
**తెలంగాణ టూరిజం, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్త నిర్వహణ**
**హనుమకొండ నుంచి మేడారానికి, జాతరపై ఏరియల్ వ్యూ రైడ్స్**
**రెండు రకాల సర్వీసులకు వేర్వేరు ధరలు ఖరారు**





**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు ఇవాళ్టి నుంచి ప్రారంభమయ్యాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35,999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది. ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం 'జాయ్ రైడ్స్' నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.

# వలపు వలకు చిక్కి రూ.2.14 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ టెక్కీ

**సోషల్ మీడియాలో పరిచయమైన మహిళ మాయలో టెక్కీ**
**ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడుల పేరుతో భారీ మోసం**
**విడతలవారీగా రూ.2.14 కోట్లు బదిలీ చేయించిన కేటుగాళ్లు**
**అప్పులు చేసి, ఆస్తులు అమ్మి డబ్బు కట్టిన బాధితుడు**
**మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ మోసగాళ్ల చేతిలో దారుణంగా మోసపోయాడు. సోషల్ మీడియాలో పరిచయమైన ఓ మహిళ చెప్పిన మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఏకంగా రూ. 2.14 కోట్లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, టీఎన్‌జీవో కాలనీకి చెందిన 44 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబరులో సోషల్ మీడియా ద్వారా ఓ మహిళ పరిచయమైంది. తాను స్టాక్ ట్రేడింగ్‌లో భారీగా లాభాలు గడిస్తున్నట్లు నమ్మించింది. ఆమె మాటలు విశ్వసించిన బాధితుడి చేత ఓ నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించింది. డిసెంబర్ 12న తొలిసారిగా రూ. 31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా, యాప్‌లో భారీగా లాభాలు కనిపించాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని ఆ మహిళ ఆశ చూపింది. ఆమెను నమ్మి రెండోసారి రూ. 42.27 లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, వచ్చిన లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాలని మోసగాళ్లు మెలిక పెట్టారు. యాప్‌లో కనిపిస్తున్న వర్చువల్ లాభాలను నిజమని నమ్మిన బాధితుడు, ఆఫీసు సహోద్యోగుల నుంచి రూ. 90 లక్షలు అప్పు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల నుంచి డబ్బు సేకరించి, కొన్ని ఆస్తులను కూడా అమ్మి మొత్తం 8 విడతల్లో రూ. 2.14 కోట్లు వారికి పంపాడు. చివరకు డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా మరో రూ. 68 లక్షలు కట్టాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు, ఆ మహిళ ఫొటోను ఇంటర్నెట్‌లో వెతకగా, అది ఇన్‌స్టాగ్రామ్‌లోని వేరొకరి ప్రొఫైల్ నుంచి దొంగిలించిందని తేలింది. దీంతో తాను నకిలీ ప్రొఫైల్‌తో మోసపోయానని నిర్ధారించుకుని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దావోస్ పర్యటన ఫలప్రదం... బ్రాండ్ ఏపీకి ప్రపంచ ఖ్యాతి: సీఎం చంద్రబాబు

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

దావోస్?లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (ఔజుఖీ) సదస్సులో తన పర్యటన విజయవంతమైందని, ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండింగ్?ను ప్రోత్సహించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ పారిశ్రామిక రంగంలోని ధోరణులను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాల దృక్పథాలను అర్థం చేసుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడు రోజులుగా జరిగిన వివిధ సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, పర్యాటకం వంటి కీలక రంగాల్లో రాష్ట్రం సాధించిన విజయాలను, ప్రగతిని సమర్థవంతంగా ప్రపంచానికి తెలియజేశామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రపంచ కార్పొరేట్ దిగ్గజాలు భారత్?పై అధిక ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (జమీా) ఒక ప్రకటనలో తెలిపింది.

# కరప్షన్ కేర్ ఆఫ్ రిజిస్ట్రేషన్స్ !

మొదటి పేజీ తరువాయి

యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయన్న ఆరోపణలు చాలానే ఉన్నాయి. వనస్థలిపురంలో పార్కు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో సబ్‌రిజిస్ట్రార్‌పై వేటు పడటం ఈ వ్యవస్థ ఎంత లోతుగా కుళ్లిపోయిందో చెప్పకనే చెబుతోంది.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి**

రంగారెడ్డి జిల్లా నుంచే ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా సుమారు రూ.3,000 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. కానీ అక్రమ రిజిస్ట్రేషన్లు, తప్పుడు విలువలు, లంచాల లావాదేవీల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం అవినీతి సమస్య కాదు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే ప్రమాదమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**గచ్చిబౌలి, రంగారెడ్డిలో అవినీతికి పరాకాష్ట**

తాజాగా గచ్చిబౌలిలో జరిగిన ఘటన అవినీతికి అద్దం పడుతోంది. సర్వే నంబర్ 91లోని 700 చదరపు గజాల భూమిని నకిలీ జీపీఏతో రిజిస్ట్రేషన్ చేయడంలో సబ్‌రిజిస్ట్రార్ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.14 కోట్లు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఈవోడబ్ల్యూ పోలీసులు రంగంలోకి దిగారు. సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు నకిలీ జీపీఏ సృష్టించిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి.

**వేటు ఉన్నా భయం లేదు!..**

ఏసీబీ దాడులు,సస్పెన్షన్లు జరుగుతున్నా అధికారుల్లో భయం లేదన్న విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఒకరు పట్టుబడితే మరొకరు అదే పంథాలో ముందుకు సాగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.'చేతులు తడపనిదే పని కాదు' అన్న పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతుండటం వ్యవస్థ వైఫల్యాన్ని చాటుతోంది.

**మళ్ళీ మేమే ఉంటాం... లేకుంటే ప్రమోషన్**

లంచం తీసుకుంటూ దొరికిన ఓ అధికారికి కొన్నాళ్ల తరువాత ప్రమోషన్ కూడా వస్తుంది. అదెలా సాధ్యం? పట్టుబడిన అధికారులు వారంలోనే బెయిల్పై బయటికొస్తారు. కానీ వాళ్లపై ఛార్జ్ షీట్ దాఖలు చేయడానికి రెండుమూడేళ్లు పట్టొచ్చు రెండేళ్ల తర్వాత కూడా కేసు విచారణ పూర్తి కాకపోతే.. పట్టుబడిన ఉద్యోగిని తాత్కాలికంగా తిరిగి అదే పోస్టుకి తీసుకుని వేరే ఏరియాకు ట్రాన్స్ఫర్ చేస్తారు. అప్పటికే, ఎవరైతే కంప్లైంట్ ఇచ్చారో వాళ్లకు గిఫ్ట్ వెళ్తాయ్ ఇవన్నీ సక్రమంగా జరిగితే మూడేళ్లకే నిర్దోషిగా బయటపడి ప్రమోషన్ దక్కించుకుంటాడు. అందుకే లంచం తీసుకుంటుండగా పట్టుకోవటం, రికార్డు చేయటం,కేసు పెట్టడం పైకి కనిపించేది ఇంత వరకే. దొరకడానికి, ప్రమోషన్కు మధ్య పెద్ద చరిత్రే జరుగుతుంది.

**డిజిటల్ లోను దోచుడే**

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో అంతా డిజిటల్ పేమెంట్సే ఇప్పుడు ఎక్కడా నోట్ల కట్టలు తీయక్కర్లేదు. అలా రూల్స్ ఉన్నాయి. కాని, ఏసిబి అధికారులు అనుకోకుండా తనిఖీ లకు వెళ్లినప్పుడు మాత్రం నోట్ల కట్టలు కిటికీల నుంచి దూకి బయటికొచ్చేస్తున్నాయి. నోటు కనపడడమే తప్పు అంటుంటే సబ్రిస్ట్రార్ ఆఫీసులలో కట్టలకు కట్టలు దొరుకుతున్నాయి. ఏ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకైనా వెళ్లండి పక్కనే డాక్యుమెంట్ రైటర్ పేరుతో షాపులు ఉంటాయి. అవినీతి పురుడుపోసుకునేది అక్కడే. నేరుగా డబ్బులు తీసుకోవడం గట్రా ఎక్కడా కనిపించనివ్వరూ. మొత్తం కథ అంతా డాక్యుమెంట్ రైటర్ల దగ్గరే తేలిపోతాయి..

**పూర్తి ప్రక్షాళన కోరుతున్న ప్రజలు**

రిజిస్ట్రేషన్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, దళారుల వ్యవస్థను రద్దు చేయాలని డిజిటల్ ట్రాకింగ్‌తో పారదర్శకత తీసుకురావాలని, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రజాసేవ కేంద్రాలుగా కాకుండా, అవినీతికి శాశ్వత అడ్డాలుగా మిగిలిపోతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కొత్త అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్... ఏపీలో ఎక్కడెక్కడ ఆగుతుందంటే...!

**చర్లపల్లి - తిరువనంతపురం మధ్య కొత్త అమృత్ భారత్ రైలు**
**ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు ప్రధాన స్టేషన్లలో ఆగనున్న ఎక్స్‌ప్రెస్**
**రేపు తిరువనంతపురంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ**
**సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు ప్రయోజనం**

**అమరావతి, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి కేరళలోని తిరువనంతపురం మధ్య నడిచే కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లోని పలు కీలక స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది. ఈ కొత్త సర్వీసును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం (జనవరి 23) తిరువనంతపురంలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట జంక్షన్లలో ఆగుతుంది. దీనివల్ల రాష్ట్రంలోని ప్రయాణికులకు దక్షిణ భారతదేశంలోని ముఖ్య నగరాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఇక తెలంగాణలో ఈ రైలుకు నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ఈ రైలు షెడ్యూల్ ప్రకారం, తిరువనంతపురంలో ఉదయం 10:45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:30 గంటలకు చర్లపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ రైలును కేటాయించినందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా, తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు అమృత్ భారత్ రైళ్లను రూపొందించారు. ఇప్పటికే చర్లపల్లి నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్ మధ్య ఒక అమృత్ భారత్ రైలు సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.



# గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్...

**తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు**
**గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల రద్దుపై తీర్పు వాయిదా**
**ఫిబ్రవరి 5న తీర్పును వెల్లడించనున్న తెలంగాణ హైకోర్టు**
**సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేసిన టీజీపీఎస్సీ, అభ్యర్థులు**
**గతంలో నియామకాలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ధర్మాసనం**
**తీర్పు వాయిదాతో అభ్యర్థుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ**

**అమరావతి, జై భీమ్ న్యూస్**

తెలంగాణ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (౧ఠూజ), ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణ రక్షణ పి. వెంకన్న

**'అరైవ్ అలైవ్' ప్రచారంలో భాగంగా కాజీపేట డీమార్ట్ వద్ద రోడ్డు భద్రత అవగాహన**
**అతివేగం, మద్యం ముప్పే 'అరైవ్ అలైవ్' ద్వారా హెచ్చరిక**

**కాజీపేట, 22 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన మానవ ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 7వ రోజు గురువారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీమార్ట్, కాజీపేట వద్ద విస్తృత స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు, కాజీపేట లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. ప్రజలు అధికంగా గుమిగూడే మాల్స్, షాండీలు, రైతు బజార్లను గుర్తించి, నేరుగా ప్రజలతో ముఖాముఖి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, రోడ్డుపై చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లు నడిపే వారు సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి, అలాగే మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, దాని వల్ల కుటుంబాలు, సమాజం తీవ్రంగా నష్టపోతాయని వివరించారు. అలాగే వేగ పరిమితులను పాటించడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనం నడపకూడదని, వాహనాల సరైన నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ మార్కింగ్స్‌ను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. పాదచారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రాత్రి వేళల్లో ప్రతిబింబించే వస్త్రాలు ధరించడం ఎంతగానో అవసరమని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే పోలీసుల చర్యలతో పాటు ప్రజల బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అనేక కుటుంబాల్లో ఆనందం నిలిచిపోతుందని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే 'అరైవ్ అలైవ్' ప్రచార ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు రోడ్డు భద్రతపై అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలు ట్రాఫిక్ పోలీసుల చర్యలను అభినందిస్తూ, రోడ్డుపై భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందిందని పోలీసులు తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకన్న మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్‌సీటుబెల్ట్ వినియోగం లేకపోవడమేనని తెలిపారు. వీటిని నివారించేందుకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తన వ్యక్తిగత బాధ్యతగా భావించి పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా యువత రోడ్డు భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, చిన్న తప్పిదం కూడా జీవితాంతం బాధను మిగిల్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాల్స్, షాపింగ్ కాంప్లెక్సులు, రైతు బజార్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ, ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని మార్గనిర్దేశం చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా కాజీపేట పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రవణ్, పోలీస్ సిబ్బంది, డీమార్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దొరికినప్పుడే దోచేస్తాం..!





**ఫీజు రూ. 90 వేలు, కట్టాల్సింది రూ. లక్ష.20 వేలు.**
**అడ్మిషన్ల పేరుతో నాటకాలు-ఫీజుల వసూళ్లకు నరకయాతనలు**
**హోమ్ సిక్ హాలిడే పేరుతో ఫీజుల వసూళ్లకు విద్యార్థులను ఇంటికి..**
**ఫీజు కట్టలేదని ప్రాక్టికల్స్‌కు అనుమతి నిరాకరణ..**
**విద్యార్థులకు అన్నం కూడా లేకుండా వేధింపులు**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ, కొన్ని ఇంటర్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై దాష్టికంగా ప్రవర్తిస్తున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఫీజులు పూర్తిగా కట్టకపోతే క్లాస్ లోకి రానిచ్చేది లేదని, ప్రాక్టికల్ పరీక్షలు రాయనివ్వమని, హాస్టల్‌లో భోజనం కూడా పెట్టమని బెదిరింపులకు పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. అడ్మిషన్ల సమయంలో ఆకర్షణీయమైన మాటలతో విద్యార్థులుతల్లిదండ్రులను మోసగిస్తున్న యాజమాన్యాలు, పరీక్షల వేళ మాత్రం ఫీజుల వసూళ్ల కోసం నరకయాతనలకు గురి చేస్తున్నాయి. "మొత్తం ఫీజులు వెంటనే కట్టాలి" అంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ, విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారు.

**కృష్ణవేణి కాలేజీ నిర్వాకం..**

రంగారెడ్డి జిల్లా బీ.ఎన్. రెడ్డి నగర్‌లోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీ (కృష్ణవేణి జూనియర్ కాలేజీ) ఫీజులు కట్టలేదనే కారణంతో విద్యార్థులను ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించలేదని, హాస్టల్‌లో భోజనం కూడా నిలిపివేశారని విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షలు దగ్గరపడుతున్న వేళ ఇలా వ్యవహరించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హోమ్ సిక్ పేరుతో ఫీజుల వసూళ్లు..**


హోమ్ సిక్ హాలిడే పేరుతో ఫీజుల వసూళ్లకు విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న దౌర్భాగ్యమైన పరిస్థితి ప్రైవేట్ యాజమాన్యాలలో కనిపిస్తున్నాయి. ఒక పూట అన్నం మిగులుతుందని ఇంటికి పంపి డబ్బులు తేవాలని సిబ్బంది ఇబ్బందలకు గురించేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెప్పేదొక ఫీజు...కట్టించుకునేది మరో ఫీజు..**

ఇంటర్‌లో జాయిన్ చేయించుకునే సమయంలో ఫీజులో రాయితీ ఇస్తామని మొత్తం నిబంధనలకు విరుద్ధంగా ఫీజు రూ. 90,000 దండుకుంటూ ఇప్పుడు పరిక్షల సమయంలో రూ. 1,10,000 కట్టాల్సిందేనని ఒత్తిడికి గురించేస్తున్నారు. ఆఫీసియల్ ఒకలెక్క అన్ ఆఫీసియల్ ఒకలెక్క.ఇది ప్రస్తుత యాజమాన్యాల తీరు.

**నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు..**

అడ్డగోలు అనుమతులతో కాలేజీల నిర్వహణ,ఫీజుల వసూళ్లకు అనుచిత పద్ధతులు, పరీక్షల ముందు విద్యార్థులపై ఒత్తిడి, బెదిరింపులు,మౌలిక హక్కులైన భోజనం, పరీక్షలకు హాజరు హక్కుల నిరాకరణ ఇలాంటి నిబంధనలపై బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి వెళ్ళినప్పటికీ మాకెందుకులే వాళ్ళ తిప్పలు వాళ్ళు పడతారు అనుకుంటూ కాలేజ్ యాజమాన్యలకు దిశా నిర్దేశం చేయని పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇవి ఇలాగే కొనసాగితే జరిగే పరిణామలకు యాజమాన్యాలు పరిణామలకు వహించాల్సిందే అంటున్నారు విద్యా నిపుణులు. పరీక్షల,విషయంలో ఫీజుల విషయంలో విద్యార్థులని ఒత్తిడికీ గురి చేయవద్దని హెచ్చరిస్తున్నాయి.



# మేడారం భక్తులకు హెలికాప్టర్ సేవలు ప్రారంభం

**జాతరను విహంగ వీక్షణం చేసే అవకాశం ఒక్కో రైడ్‌కు రూ.4,800 చార్జీ**



**మేడారం, జనవరి 22, 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక సమాగమంగా గుర్తింపు పొందిన శ్రీ సమ్మక్కసారలమ్మ మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు తెలంగాణ ప్రభుత్వం మరో ప్రత్యేక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో మేడారం జాతర సందర్భంగా హెలికాప్టర్ సేవలను గురువారం నుంచి అధికారికంగా ప్రారంభించింది. భక్తుల సౌకర్యార్థం ములుగు జిల్లా పడిగాపూర్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ జాయ్ రైడ్స్ నిర్వహించనున్నారు. ఈ హెలికాప్టర్ రైడ్స్ ద్వారా భక్తులు సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు మేడారం జాతర ప్రాంగణం, గద్దెల ప్రాంతం, జంపన్నవాగు, పరిసర అటవీ ప్రాంతాలను విహంగ వీక్షణం చేసే అరుదైన అవకాశాన్ని పొందనున్నారు. ఒక్కో వ్యక్తికి హెలికాప్టర్ రైడ్‌కు రూ.4,800 చార్జీగా నిర్ణయించినట్లు టూరిజం శాఖ అధికారులు తెలిపారు. జాతర సమయంలో భారీగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడంతో పాటు, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పించడమే ఈ సేవల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. జాతర నిర్వహణలో భాగంగా ఇప్పటికే రహదారులు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, భద్రత వంటి ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టిన ప్రభుత్వం, ఇప్పుడు పర్యాటక శాఖ ద్వారా హెలికాప్టర్ సేవలను ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలతో వచ్చే కుటుంబాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, అనుభవజ్ఞులైన పైలట్లు, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఈ హెలికాప్టర్ సేవలు నిర్వహించనున్నట్లు టూరిజం శాఖ స్పష్టం చేసింది. వాతావరణ పరిస్థితులు, భద్రతా కారణాల రీత్యా అవసరమైతే సేవల సమయంలో మార్పులు చేసే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. మేడారం జాతర సందర్భంగా తొలిసారిగా ఇంత స్థాయిలో హెలికాప్టర్ జాయ్ రైడ్స్ ఏర్పాటు చేయడం భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది. ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ప్రకృతి సౌందర్యాన్ని విహంగ వీక్షణం చేసే అవకాశం లభించడంతో, ఈ సేవలకు మంచి స్పందన లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# మున్సి పోల్ కీ రెడీ..

**నువ్వా నేనా అంటూ పోటీ కి సిద్ధమవుతున్న నాయకులు**
**బ్యాలెట్ పేపర్‌తోనే రాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు**
**75 గుర్తులతో ఉత్తర్వులు జారీ**
**ఫిబ్రవరి 15లోపు ప్రక్రియ పూర్తి**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సంగ్రామానికి తెరపడనుంది. ఫిబ్రవరి 15వ తేదీ లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి కావడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

**బ్యాలెట్ పేపర్‌తోనే పోలింగ్..**

ఈసారి మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగనున్నాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో బ్యాలెట్ బాక్స్‌లను వినియోగించనున్నారు. ఈ మేరకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామగ్రి సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశించింది.

**షెడ్యూల్‌కు ముందస్తు ఏర్పాట్లు..**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, మున్సిపాలిటీలుకార్పొరేషన్ల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఎన్నికల నిర్వహణ, భద్రత, సిబ్బంది నియామకం, పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లపై కీలక సూచనలు జారీ చేసింది. ఇప్పటికే తుది ఓటర్ల జాబితాను ప్రకటించిన ఎన్నికల సంఘం, జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా ఫొటోతో కూడిన ఓటర్ ఫైనల్ లిస్ట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. అదే విధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల వివరాలను టి-పోల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించింది.

**సింబల్స్ గెజిట్ విడుదల..**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీలకు సంబంధించిన ఎన్నికల గుర్తులను రాష్ట్ర ఎన్నికల సంఘం గెజిట్ ద్వారా విడుదల చేసింది. మొత్తం 75 గుర్తులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాలెట్ పేపర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి తొలి స్థానం, అనంతరం బీఎస్పీ,బీజేపీ,బీఆర్ఎస్, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలకు వరుసగా స్థానాలు కేటాయించారు. అలాగే ఎన్నికల సంఘంలో నమోదు అయి, గుర్తులు లేని 77 రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల కోసం కూడా ప్రత్యేక గుర్తులను కేటాయించారు. ఏసీ, ఆపిల్, గాజులు, పండ్ల బుట్ట, బ్యాట్, బ్రెడ్ వంటి గుర్తులు బ్యాలెట్‌లో కనిపించనున్నాయి.

**రిజర్వేషన్ల ఖరారు..**

2011 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేయగా, డెలిగేట్స్ కమిషన్ ప్రతిపాదనల మేరకు బీసీ రిజర్వేషన్లను నిర్ణయించారు.

మొత్తం 121 మున్సిపాలిటీల్లో ఎస్టీ : 5, ఎస్సీ : 17, బీసీ : 38, స్థానాలు కేటాయించగా, మిగిలిన




వాటిలో ఉమెన్ జనరల్ 31, అన్ రిజర్వ్ 30 ఉన్నాయి. మొత్తం స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**ఫిబ్రవరి 14లోపు ఫలితాలు..**

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. క్లియరెన్స్ లెటర్ అందిన వెంటనే సమావేశం ఏర్పాటు చేసి, నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిబ్రవరి 14లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలనే లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వారీగా అధికారులతో సమన్వయం చేస్తూ ఎన్నికల నిర్వహణపై తుది ఆదేశాలు ఇవ్వనున్నారు. మొత్తానికి,బ్యాలెట్ పేపర్‌తో జరిగే మున్సిపల్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అధ్యాయంగా మారనున్నాయి.షెడ్యూల్ విడుదలతోనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వేడి మరింత పెరగనుంది.

# మహిళా సంఘాలకు ఎలక్ట్రిక్ బస్సులు

**తొలి దశలో 4050 సంఘాలకు పంపిణీ**
**నగర పేద మహిళలకు ఉపాధి, ఆదాయ వనరుల విస్తరణే లక్ష్యం మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైద్రాబాద్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ఎలక్ట్రిక్ బస్సులు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే మహిళా సంఘాలకు బస్సులు కేటాయించి అదనపు ఆదాయం వచ్చేలా చేసిన ప్రయోగం విజయవంతమైందని, అదే నమూనాను నగరంలో కూడా అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తొలి దశలో నగరంలోని 40 నుంచి 50 మహిళా స్వయం సహాయక సంఘాలకు ఎలక్ట్రిక్ బస్సులు అందించనున్నట్లు చెప్పారు. మహానగర పాలకమండలి పాలన గడువు మరో 19 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో, బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మెతె శ్రీలతారెడ్డిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్-సిటీ, ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో పాటు నగరంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సేవల అమలు, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరాభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రస్తుతం 72,942 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఈ సంఖ్యను లక్షకు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి పేద మహిళ తప్పనిసరిగా స్వయం సహాయక సంఘంలో చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా మహానగర పాలకమండలితో కలిసి పనిచేసిన అధికారులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నగర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరి సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుతో నగర పేద మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పర్యావరణహిత రవాణాకు ప్రోత్సాహం లభించనుందని అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణలో బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది: మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. మున్ముందు బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. అర్వింద్ 'జై శ్రీరాం' అని కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కర్ణాటకలో 60 ఏళ్లు పైబడిన జర్నలిస్టులకు చికిత్సపై 75% తగ్గింపు

**సీనియర్ జర్నలిస్టులకు యశస్విని మరియు పెన్షన్ ప్రయోజనాలను సరళీకృతం చేయనున్న ప్రభుత్వం**

బెంగళూరు(జై భీమ్ న్యూస్)

సమాజాన్ని సరిదిద్దడానికి మరియు మార్గనిర్దేశం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన జర్నలిస్టులకు ప్రత్యేక ప్రయోజనాలను అందించడానికి మా విభాగం చొరవ తీసుకుంది. 60 ఏళ్లు పైబడిన అన్ని జర్నలిస్టులు వైద్య విద్య శాఖ పరిధిలోని అన్ని ఆసుపత్రులలో వైద్య చికిత్సపై 75% రాయితీని పొందుతారు. వారు నామమాత్రపు రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి మరియు రాయచూర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ ఆర్. పాటిల్ అన్నారు. వైద్య విద్య శాఖ, జయదేవా ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ మరియు సీనియర్ జర్నలిస్ట్స్ ఫోరం బుధవారం ఇక్కడ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులకు హెల్త్ కార్డులను పంపిణీ చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రితో సంప్రదించి, మిగిలిన 25% చికిత్స ఖర్చులపై రాయితీ మంజూరు చేయడంపై రాబోయే రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "జర్నలిస్టులు మన ప్రభుత్వ బాధ్యత. పదవీ విరమణ చేసిన సీనియర్ జర్నలిస్టులు గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలరని నిర్ధారించుకోవడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని ఆయన అన్నారు. తమ వృత్తి ద్వారా సమాజానికి గణనీయమైన కృషి చేసి పదవీ విరమణ చేసిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఈ పెన్షన్ పథకం నియమాలు మరియు విధానాలను సరళీకృతం చేయడానికి చర్యలు తీసుకుంటామని డాక్టర్ పాటిల్ తెలిపారు.

# హత్య కేసులో భార్యతో సహా ఇద్దరు కుమారులకు యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)

ఆస్తి తగాదాల నేపథ్యంలో భర్తను రోకలి బండతో దారుణంగా హత్య చేసిన భార్యతో పాటు ఇద్దరు కుమారులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తుది తీర్పును వెలువరించింది. ఈ కేసు వివరాలను పాలకుర్తి ఇన్‌స్పెక్టర్ వెల్లడిస్తూ, తేదీ 09-07-2017న మొండ్రాయి గ్రామానికి చెందిన బూర్గుల ప్రభాకర్ (వయస్సు 58)ను అతని భార్య బూర్గుల పూలమ్మ తన ఇద్దరు కుమారులు బూర్గుల మురళి, బూర్గుల శ్రీకాంత్‌లతో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. మృతుడు ప్రభాకర్‌కు భార్యతో కొన్ని సంవత్సరాల అనంతరం మనస్పర్థలు తలెత్తడంతో దంపతులు గత 13 సంవత్సరాలుగా వేరుగా జీవించారు. అనంతరం పెద్దమనుషుల సమక్షంలో మళ్లీ కలిసి జీవిస్తున్న సమయంలో కుమార్తె వివాహం, ఆస్తి పంపకాల విషయాల్లో తరచూ గొడవలు జరుగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో 09-07-2017న మృతుడితో జరిగిన గొడవ తీవ్రస్థాయికి చేరడంతో నిందితులు ముగ్గురు కలిసి రోకలి బండతో కొట్టి ప్రభాకర్‌ను అత్యంత దారుణంగా హత్య చేశారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొడకండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి పాలకుర్తి సీఐ కరుణా సాగర్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో ముగ్గురు నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత పాలకుర్తి సీఐ వి. జానకిరామ్ రెడ్డి, కొడకండ్ల ఎస్ఐ చ. రాజు, కోర్టు కానిస్టేబుల్ నరేష్ సాక్షులను కోర్టులో హాజరు పరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశ్చంద్ర ప్రసాద్ బాధితుల తరపున వాదనలు వినిపించారు. ఈ మేరకు 22-01-2026న జనగామ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి బి. ప్రతిమ ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తుది తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి న్యాయం సాధించిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు.

## నిన్న హరీష్ రావుకి, నేడు కేటీఆర్ కి సిట్ నోటీసులు ఇవన్నీ రాజకీయ కక్ష సాధింపు చర్యలే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో కమిషన్ల పేరిట, నోటీసుల పేరిట, సిట్ పేరిట, విచారణల పేరిట ప్రతిపక్ష నాయకులను రాజకీయంగా వేధించే ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. ఇటీవల మాజీ మంత్రి హరీష్ రావుకి, నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ కి సిట్ నోటీసులు జారీ చేయడం పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యలుగానే తెలంగాణ సమాజం భావిస్తోందని అన్నారు. పాలన చేతకాక, ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని మండిపడ్డారు. కమిషన్ల పేరిట, విచారణల పేరుతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్థాయిని తగ్గించాలనే కుట్రలు, కుతంత్రాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆరోపించారు. పాలకులు, ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత వేధించినా బాధ్యతగల ప్రతిపక్షంగా, ఉద్యమకారులుగా, స్వరాష్ట్ర సాధకులుగా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు న్యాయస్థానాలపై, ప్రజాస్వామ్యంపై గౌరవంతో నిజాయితీగా సమాధానాలు ఇస్తూనే ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తారని స్పష్టం చేశారు. 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయలేక ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉద్యమబిడ్డలైన బీఆర్ఎస్ నాయకులకు కేసులు, నోటీసులు కొత్త కాదని, ఇలాంటి చిల్లర చేష్టలతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అదరరని బెదరరని తెలిపారు. ప్రతిపక్ష నాయకులను వేధించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించాలని పాలకులు భావించడం వారి అవివేకమేనని అన్నారు. రెండేళ్లలో అమలు కాని హామీలు ఇచ్చి, ఎగవేతలు, కోతలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకత్వానికి బీఆర్ఎస్ గులాబీ దండు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.

# మా మీద భారీగా పన్నులు వేయండి

**దావోసకు హాజరైన దేశాల అధినేతలను ఉద్దేశించి 24 దేశాలకు చెందిన 400 మంది సం'పన్న'ల లేఖ**

న్యూఢిల్లీ(జై భీమ్ న్యూస్)


జనవరి 21 ప్రభుత్వాలు విధించే పన్నుల తాకిడికి తట్టుకోలేక.. పనామా, బహమాస్ వంటి ట్యాక్స్‌ఫ్రీ దేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడే సంపన్నుల గురించి వినే ఉంటారు! కానీ తొలిసారిగా.. 'కమాన్, మా మీద అధిక పన్నులు వేయండి' అం టూ 24 దేశాలకు చెందిన 400 మంది సూపర్ రిచ్ కుబేరులు దావోసలో భేటీ అవుతున్న ప్రపంచ దేశాధినేతలకు ఒక బహిరంగ లేఖ రాశారు. "టైమ్ టు విన్.. వుయ్ మస్ట్ విన్ బ్యాక్ అవర్ ఫ్యూచర్. లీడర్స్ ఎట్ దావోస్, ట్యాక్స్ ద సూపర్ రిచ్ (గెలవాల్సిన సమయం.. మన భవిష్యత్తును తిరిగి పొందాలి. దావోసలోని నాయకులారా, అత్యంత సంపన్నులపై పన్నులు విధించండి)' అనే శీర్షికతో రాసిన లేఖపై హాలీవుడ్ నటుడు మార్క్ రఫాలో ('హల్క్' పాత్రధారి), అబిగెయిల్ డిస్నీ (వాల్ట్ డిస్నీ మనవరాలు) వంటివారు సంతకాలు చేశారు. ఇది మనకు చాలా కొత్తగా అనిపించొచ్చుగానీ.. 'పేట్రియాటిక్ మిలియనీర్స్ (దేశభక్త కోటీశ్వరులు అనొచ్చు!)' పేరిట అమెరికాలోని అత్యంత ధనవంతులు చాలాకాలంగా ఈ డిమాండ్ చేస్తున్నారు. పేదలు, అత్యంత సంపన్నుల మధ్య నానాటికీ పెరిగిపోతున్న అంతరాలను తగ్గించడానికి తమలాంటివారిపై ప్రభుత్వం అధికంగా పన్నులు విధించాలన్నది వారి డిమాండ్. అమెరికా మిలియనీర్ల స్ఫూర్తితో కెనడా, యూకేల్లోని కొందరు మిలియనీర్లు కూడా అదే పేరుతో సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా కలిసి.. ఇదే తరహాలో పనిచేసే 'మిలియనీర్స్ ఫర్ హ్యూమానిటీ', పేదరిక నిర్మూలన కోసం అంతర్జాతీయ స్థాయిలో కృషి చేసే 'ఆక్స్‌ఫామ్' వంటి సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. దావోసలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచీ వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, రాష్ట్రా ల సీఎంలు, ఆర్థిక మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లు వస్తారు కాబట్టి.. సూపర్ రిచ్‌పై పన్నులు వేసేలా వారిని కోరుతూ ఈ లేఖ రాశారు. ఐదున్నర దశాబ్దాల క్రితం దావోసలో ప్రపంచ ఆర్థిక వేదిక తొలి సదస్సు జరిగినప్పుడు మానవాళి గణనీయమైన ప్రగతి అనే ఉదయకాలం ముందు నిలబడిందని.. ఈ 55ఏళ్ల కాలంలో టెక్నాలజీ, వైద్యం, సమాచార ప్రసారం, ప్రపంచ వాణిజ్యం ఇలా అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని లేఖలో గుర్తుచేశారు. ఈరోజు ప్రపంచ ప్రజలంద రూ గతంలో ఎన్నడూలేనంతగా (టెక్నాలజీ పరం గా) అనుసంధానమై ఉన్నామని.. అదే సమయంలో (ఆర్థికంగా) ఎప్పుడూ లేనంతగా విడిపోయి ఉన్నామన్నారు. దశాబ్దాలుగా సాగుతున్న ఆవిష్కరణల ప్రయాణం.. అసమానతలు, పర్యావరణ విధ్వంసంతోపాటే జరిగిందని గుర్తుచేశారు. ప్రపంచ జనాభాలో కేవలం 1శాతంగా ఉన్న అత్యంత సంపన్నుల వద్ద.. మిగిలిన జనాభాలో 95శాతం మందికన్నా ఎక్కువ ధనం పోగుపడిందన్నారు. అత్యంత ధనవంతులకు, మిగతావారికి మధ్య ఉన్న ఈ తేడా రోజురోజుకూ, తరతరాలకూ పెరుగుతూపోతోందని.. అపార సంపద కలిగిన గుప్పెడు మంది అపరకుబేరులు ప్రజాస్వామ్యాలను కొనుగోలుచేశారని.. ప్రభుత్వాలపై ఆధిపత్యం సాధించారని.. పత్రికాస్వేచ్ఛను హరించారని.. టెక్నాలజీ, ఆవిష్కరణలపై పట్టు సాధించారని, పేదరికాన్ని సామాజిక అసమానతలను పెంచేశారని ఆందోళన వెలిబుచ్చారు. తమలాంటి ధనవంతులే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారంటే.. సమాజం ప్రమాదకరమైన అం చున నిలబడి ఉందన్న విషయంలో సందేహమూ లేదన్నారు. "మన ప్రజాస్వామ్యాలు, సమాజాలు, మన భవిష్యత్తు మనకు తిరిగి కావాలి. 2026లో మనం చేయాల్సింది ఇంకా చాలా ఉంది" అని పేర్కొన్నారు. అందుకు తాము సూచిస్తున్న ప్రభావంతమైన పరిష్కారం ఒక్కటేనని.. అది అత్యంత సంపన్నులపై అత్యధికంగా పన్నులు వేయడమన్నారు.




# దేశం కోసం ప్రశ్నిస్తున్నాడు

హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)

'ప్రశ్న.. లక్ష మెదళ్ల కదలిక' అంటారు పెద్దలు. అలాంటి ప్రశ్నలే వందలు, వేలల్లో వేశాడు ఉత్తరప్రదేశ్‌కి చెందిన 14 ఏళ్ల అశ్వమిత్ గౌతమ్. సోషల్‌మీడియా వేదికగా అశ్వమిత్ వేసిన ఆ ప్రశ్నలు దేశంలో జరుగుతున్న అన్యాయాలని, అక్రమాలని ఎండగట్టేవి. అవినీతిని ఎత్తి చూపేవి. పాలకుల ప్రగల్భాలు, ప్రజల వాస్తవ స్థితిగతులని కళ్లకికట్టినట్లు చూపించేవి. అందుకే అంబేద్కర్, భగత్‌సింగ్ వారసుడిగా ఇన్‌స్టాలో తనని లక్షలాది మంది అనుసరిస్తున్నారు. ఈ చైతన్యం చూసిన పాలకులు, అధికారులకి ముచ్చెమటలు పట్టాయి. క్షణం ఆలస్యం చేయకుండా,మైనర్ అని కూడా చూడకుండా సెక్షన్ 151 ప్రయోగించి ఈ జనవరిలో అశ్వమిత్‌ని లక్నో పోలీసులు అరెస్టు చేశారు. గంటల వ్యవధిలోనే తను విడుదలయ్యాడు. అయితే ఈ అరెస్టు దేశంలో పెద్ద ఎత్తున చర్చకి దారితీసింది. పాలకులని ఇంతలా భయపెట్టిన తన గురించి, తను సంధించిన ప్రశ్నల గురించి సోషల్‌మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. పాలకులు, అధికారులు ఉన్నపళంగా తన గొంతు నులిమేంతగా అశ్వమిత్ ఏయే ప్రశ్నలు వేశాడో తెలుసుకుంటే మేధావులు సైతం ఆశ్చర్యపోతారు. లక్నో, బీహార్, పంజాబ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ఇలా ప్రభుత్వాలు ఎక్కడ అన్యాయంగా ప్రజలని దోచుకుతింటున్నా అశ్వమిత్ ప్రశ్నలు సంధించాడు. తను పరిశీలించిన అంశాలపై ఎంతో పరిణితితో మాట్లాడతాడు. ప్రభుత్వాలు కార్పొరేట్లకి దోచుకుపెడుతున్న వైనాలు, రైతుల నుండి లాక్కొంటున్న భూములు, రోడ్ల మరమ్మతులు, వరదలు, కరువు, కాటకాలు, క్రీడాకారులు, మహిళలు, హత్యలు, ఆత్మహత్యలు.. ఇలా ఒకటా రెండా ఎన్నో అంశాలపై తన ప్రశ్నల చిట్టా చాలానే ఉంది. షెడ్యూల్ కుటుంబానికి చెందిన అశ్వమిత్‌ది పేద కుటుంబం. మొబైల్ ఫోన్ పట్టుకుని చాలా సున్నితమైన అంశాలపై అలవోకగా మాట్లాడడం అతని వీడియోల్లో కనిపిస్తుంటుంది. పెరుగుతున్న జీవన వ్యయాలు, ద్రవ్యోల్బణం, యువతకి ఉపాధి అవకాశాలు లేకపోవడం, సామాజిక అసమానత, దళిత సమాజాన్ని ప్రభావితం చేసే సమస్యలు, సంక్లిష్టమైన సామాజిక-రాజకీయ సమస్యలపై కంటెంట్ క్రియేటర్‌గా చిన్న చిన్న వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తాడు. అవి తరచూ వాట్సాప్‌ల్లో షేర్ అవుతూ ఉంటాయి. అదానీ పవర్ ప్లాంట్‌పై 'బీహార్‌లో పాత కథ బయటపడింది. అదానీ పవర్ ప్లాంట్ కోసం 1.020 ఎకరాల అడవులని నరికివేశారు. వేలాది మంది రైతుల భూమి తీసుకున్నారు. అంతేకాదు, ప్లాంట్ నిర్మాణం కోసం అదానీకి ఎకరా కేవలం ఒక్క రూపాయికి 30 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. థర్మల్ ప్లాంట్ నిర్మించడానికి లక్షలాది చెట్లని త్యాగం చేయడం 'సబ్కా సాత్, సబ్కా వికాస్' ఎలా అవుతుంది? ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే జరిగింది. తప్పుడు వాగ్దానాలు ఎవరికి ప్రయోజనం? అదానీకి మాత్రమే అవి లబ్ధి చేకూర్చుతాయి. ప్లాంట్ కోసం పాఠశాలలు ఉన్న భూములని కూడా లాక్కుంటున్నారు. రైతులు, గులాబీ, బంతి పువ్వు పెంపకందారులు, మత్స్యకారులకి ఒక్క రూపాయి లీజుకి భూమిని ఎందుకు ఇవ్వకూడదు? పెద్ద వ్యాపారుల పాదాలని నొక్కాలి. చిన్న వ్యాపారులని అణచాలి. ఇదే ఇక్కడ కనిపిస్తోంది. మేక్ ఇన్ ఇండియా అందరికీ ఉండాలి. ఈ భారతదేశం కేవలం కొంతమందిది మాత్రమే కాదు. అందరిదీ.. ఆలోచించండి.. మేల్కొనండి.. పెట్టుబడిదారీ విధానం, కార్పొరేట్ పాలన నుండి తప్పించుకునే వైపు అడుగులు వేయండి..' తనపై మోపబడిన ఎఫ్ఐఆర్‌పై కూడా అశ్వమిత్ తాజాగా ఓ వీడియో చేశాడు. 'నేను చాలా ప్రభావవంతమైన వీడియో చేశాను. అయితే కొంతమంది దురుద్దేశంతో దాన్ని ఎడిట్ చేసి 'ఎక్స్'లో షేర్ చేశారు. నా అరెస్టుకి అదే కారణం. భవిష్యత్తులో నేను మరిన్ని వీడియోలు చేయకుండా అడ్డుకునేందుకే పోలీసులు నన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యని చూసి చాలామంది 'ప్రభుత్వం నన్ను చూసి భయపడింది' అని వ్యాఖ్యానిస్తున్నారు. కానీ వాస్తవం వేరే ఉంది. హక్కులు, సామాజిక కార్యకర్తలు సోనమ్ వాంగ్‌చుక్, ఉమర్ ఖలీద్ వంటి వారి గొంతుని నొక్కేందుకు ఏవిధంగా చేశారో ఇప్పుడు నన్ను కూడా అలాగే చేశారు. తమని ఎదిరించిన పెద్ద నాయకులని బెదిరించడానికి ఇడి, సిబిఐని పంపడం, ఎటువంటి విచారణ లేకుండా ఏళ్లకి ఏళ్లు కార్యకర్తలని జైళ్లల్లో పెట్టగల ఈ ప్రభుత్వం నన్ను చూసి ఎందుకు భయపడుతుంది? నా గొంతు నొక్కడంలో ఇదొక మార్గం' అంతే.. నాపై ప్రయోగించిన సెక్షన్ ప్రభావవంతమైనది కాదు. కానీ అది నా మానసిక స్థితిని తీవ్రంగా దెబ్బతీసింది. ఎన్నో రాత్రులు నా నిద్ర చెడిపోయింది. మందులు వేసుకొని పడుకోవాల్సి వచ్చింది. ఇందులోకి నా సోదరుడిని కూడా లాగారు. అది ఇంకా నన్ను బాధిస్తోంది. ఇది భారతదేశం.. ఇక్కడ రాజ్యాంగం అమలవుతోంది. ఈ దేశంలో వాక్ స్వేచ్ఛ ఎవరికీ పళ్లెంలో వడ్డించలేదు. పోరాడి సాధించుకోవాలి'. యువతని ఉద్దేశించి 'దేశంలోని యువత కొందరు నల్లమందు ప్రభావంలో ఉన్నారు. ఇప్పుడు మీరంతా మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది. తప్పుకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చే యువత ఉన్న దేశం ప్రపంచంలోనే శక్తిమంతమైనది. మీరు భారతదేశాన్ని సూపర్ పవర్‌గా మార్చాలనుకుంటే పోరాడండి. రైతుల కోసం, విద్య, ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ఆరోగ్య సౌకర్యాల కోసం, పేదలు, కార్మికుల అన్యాయానికి వ్యతిరేకంగా, రాజ్యాంగంపై దాడులకి వ్యతిరేకంగా, మానవాళిని సిగ్గుపడేలా చేస్తున్న ప్రతి చెడుకు వ్యతిరేకంగా పోరాడండి. జిఎస్‌టి తగ్గింపుపై ప్రభుత్వాలు పదే పదే జిఎస్‌టిపై మాట్లాడుతాయి. ఒకప్పుడు జిఎస్‌టి పెరుగుదల ప్రయోజనాలని ప్రచారం చేసిన వారు, ఇప్పుడు దాని తగ్గింపుని ప్రశంసిస్తున్నారు. వాస్తవాన్ని తెలుసుకోండి. 18 శాతం నుండి 5 శాతం జిఎస్‌టి తగ్గిందని సంబరపడిపోకండి. అలా జరగాలంటే రూ.120 వస్తువులు రూ.105 కి అందుబాటులోకి రావాలి. కానీ కంపెనీలు ఎంఆర్‌పి రేటు రూ.120కే విక్రయిస్తాయి. పరిణామాన్ని పెంచడం, లేదా రూ.2 విలువైన ఉచిత ఉత్పత్తిని రూ.10 అమ్మడం ద్వారా కంపెనీలు లాభపడతాయి. ఎందుకంటే ప్రభుత్వం ఎంఆర్‌పిని నియంత్రించదు. పన్నులు మాత్రమే వసూలు చేస్తుంది. దీని వలన ద్రవ్యోల్బణం తగ్గదు. ప్రజలకి ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇది ఓటు దొంగతనం. పన్నులు, ద్రవ్యోల్బణం ఆరోపణల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి రూపొందించిన ఆట ఇది'. పుస్తకాలే ప్రపంచంగా అశ్వమిత్ చేసిన ఎన్నో వీడియోల్లో తనని విపరీతంగా ప్రభావితం చేసిన పుస్తకాలని ప్రదర్శించేవాడు. 2025 చివరిలో ఆ ఏడాది చదివిన పుస్తకాల జాబితాని చూపుతూ చేసిన వీడియోలో ఒక గది నిండా పుస్తకాలు ఉన్నాయి. అవి అందించిన జ్ఞానంతోనే భిన్నమైన మార్గాన్ని అశ్వమిత్ ఎంచుకున్నాడు. పైన ఉదహరించిన ప్రశ్నలు తను సంధించిన వందల ప్రశ్నల్లో కొన్ని మాత్రమే.. మరెన్నింటినో సూటిగా, చైతన్యవంతంగా ప్రజల ముందుకు తీసుకువచ్చాడు. దేశంలో ఎంతోమంది 14 ఏళ్ల పిల్లలు సెల్‌ఫోన్లో రీల్స్ చూస్తూ కాలం గడుపుతుంటే.. అశ్వమిత్ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా దేశం కోసం సమయం వెచ్చిస్తున్నాడు.



# రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం పూలే విద్యాసంస్థల యాజమాన్యంపై కార్మికుల ఆవేదన

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్స్ & జూనియర్ కాలేజ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీలు,స్వీపర్లు, శానిటైజర్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబ పోషణ,ఇంటి అద్దె, నిత్యావసరాలు కూడా తీరని పరిస్థితి నెలకొంది. సంస్థలో 5 నుంచి 6 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ,తమ విధుల్లో ఎలాంటి లోటు లేకుండా బాధ్యతగా పనిచేస్తున్నామని కార్మికులు తెలిపారు. అయినా జీతాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల మాటల్లో "ఉద్యోగ భద్రత లేదు, తగిన జీతాలు రావడం లేదు. పని గంటలు ఎక్కువగా ఉన్నాయి. విశ్రాంతి సమయం కూడా లేకుండా అన్ని పనులు చేయాల్సి వస్తోంది. నిత్యావసరాల ధరలు రెట్టింపు అయిన ఈ పరిస్థితుల్లో జీతం రాకపోవడం మా జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది" అని తెలిపారు. తక్షణమే బకాయి జీతాలు విడుదల చేయాలని,పని పరిస్థితుల్లో స్పష్టమైన నిబంధనలు,మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని యాజమాన్యాన్ని వారు కోరుతున్నారు.ఈ విషయంపై యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు

# ఎర్రబెల్లి పగటి కలలు మానుకోవాలి కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు

**ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు దయాకర్ రావును పిలిచి బట్టలు పెడతాం**
**మున్సిపాలిటీపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే 100 పడకల ఆసుపత్రిపై మాజీ మంత్రివి పచ్చి అబద్ధాలు**

**వర్ధన్నపేట(జై భీమ్ న్యూస్)**

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా హాస్యాస్పదమని, అవి రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న పగటి కలలేనని వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం వర్ధన్నపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఎర్రబెల్లిపై ధ్వజమెత్తారు.

**ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశానికి ఆహ్వానం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని శేఖర్ రావు ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేసి,ఆ గృహప్రవేశ కార్యక్రమాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ముఖ్య అతిథిగా పిలుస్తామని, ఆయనకు నూతన వస్త్రాలు పెట్టి మరీ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూపిస్తామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తోంది ఇందిరమ్మ రాజ్యమేనని స్పష్టం చేశారు.

**100 పడకల ఆసుపత్రిపై అసత్య ప్రచారాలు..**

వర్ధన్నపేటలో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి దారి మళ్లుతోందన్న ప్రచారంలో ఏమాత్రం సత్యం లేదని ఆయన ఖండించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో భూ కేటాయింపుల్లో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్ది, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా శాశ్వత ప్రాతిపదికన ఆసుపత్రిని నిర్మిస్తున్నామని తెలిపారు.అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని ఎర్రబెల్లి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మున్సిపాలిటీపై హస్తం జెండా ఖాయం..**

12 వార్డులకు 12 గెలుస్తామని బీఆర్ఎస్ నేతలు చెప్పుకోవడం కేవలం భ్రమేనని,వర్ధన్నపేట మున్సిపాలిటీపై ఎగిరేది కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండానేనని శేఖర్ రావు ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మర్చిపోలేదని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెంపదెబ్బ తప్పదని హెచ్చరించారు. కొందరు పాత నాయకులకు కండువాలు కప్పినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఉన్న కాంగ్రెస్ బలాన్ని ఎవరూ తగ్గించలేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ,చిటూరి అశోక్,అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మైస సురేష్ కుమార్తో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈనెల 24న కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బిక్షాలు తెలిపారు. ఈ సమ్మేళనం కళాశాల సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం హాజరుకానున్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ జూనియర్ విద్యార్థినిలకు కెరీర్ దిశానిర్దేశం చేస్తూ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు, వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్‌కు అవసరమైన ప్రిపరేషన్ విధానాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండింగ్ గ్రూపులు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. అలాగే తమ ఉద్యోగ అనుభవాలను కూడా పంచుకోనున్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభం నుంచే ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనవాయితీగా కొనసాగుతున్నదని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సమ్మేళన కన్వీనర్ పి.వి. వైష్ణవి, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ ఎం. ఇస్త్రారి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎం. సదానందం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డాక్టర్ టి. అర్చన, ఎం. వేణుగోపాల్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ సమ్మేళనానికి విద్యార్థులు, బోధన మరియు బోధనేతర ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని డాక్టర్ కె. బిక్షాలు కోరారు.

## కేయూ ఫార్మసీ డీన్‌గా ఆచార్య ఎన్. ప్రసాద్ నియామకం





**వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం డీన్‌గా ఆచార్య డాక్టర్ ఎన్. ప్రసాద్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీన్ ఆచార్య జి. సమ్మయ్య పదవీకాలం పూర్తికావడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఆచార్య ఎన్. ప్రసాద్ 2007 సంవత్సరంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు ప్రారంభించి, 2019లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. తన సేవా కాలంలో హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా, హాస్టళ్ల డైరెక్టర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా, యూనివర్సిటీ ఐ.పి.ఆర్. సెల్ సంచాలకులుగా వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. అకాడమిక్, పరిశోధనా రంగాల్లో విశేష సేవలందించిన ఆచార్య ప్రసాద్‌కు ఇప్పటివరకు 8 పేటెంట్లు మంజూరయ్యాయి. ఆయన పర్యవేక్షణలో 7 మంది పీహెచ్‌డీలు పూర్తి చేయగా, 66 మంది ఎం.ఫార్మసీ విద్యార్థులు డిగ్రీలు సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై 79కి పైగా పరిశోధన పత్రాలను సమర్పించారు. 2024 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుల అవార్డును కూడా ఆయన అందుకున్నారు. అంతేకాకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని స్టాన్‌ఫోర్డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పని చేశారు. డీన్‌గా నియామకం కావడంతో పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య ఎన్. ప్రసాద్‌ను హృదయపూర్వకంగా అభినందించారు.

## నాగారం-ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**హసన్‌పర్తి విద్యుత్ శాఖ ఏడీఈ (ఆపరేషన్స్) పి. అశోక్**

**హసన్‌పర్తి, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



నాగారం, ఎల్లాపూర్ సబ్?స్టేషన్లలో నిర్వహించనున్న మరమ్మత్తుల పనుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హసన్‌పర్తి విద్యుత్ శాఖ ఏడీఈ (ఆపరేషన్స్) పి. అశోక్ తెలిపారు. నాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని నాగారం, ముచ్చెర్ల, సీతానగరం, పెగడపల్లి, సుడాన్‌పల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే యల్లాపూర్ సబ్?స్టేషన్ పరిధిలోని యల్లాపూర్, ఇండస్ట్రియల్ ఏరియా, సీతాంపేట, పెంబర్తి, గంతూరుపల్లి గ్రామాల్లోనూ ఇదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.విద్యుత్ శాఖ చేపడుతున్న ఈ పనులకు ప్రజలు సహకరించాలని, కలిగే అసౌకర్యాన్ని సహనంతో అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జోనల్ స్థాయి క్రీడల్లో వలిగొండ కళాశాల విద్యార్థిని వైశాలి ఘన విజయం



**తుంగతుర్తి, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

బీబీనగర్ మండలం వలిగొండ ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం. వైశాలి జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించి పలు పతకాలు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. తుంగతుర్తి హాస్టల్ మైదానంలో తేదీ 15-09-2025 (శుక్రవారం) నిర్వహించిన 11వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వైశాలి, వివిధ క్రీడా విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ పోటీల్లో ఆమె 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగులలో మొదటి స్థానాలు సాధించగా, 1500 మీటర్ల పరుగులో రెండో స్థానం పొందారు. అంతేకాకుండా లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, హై జంప్‌లో రెండో స్థానం సాధించి క్రీడారంగంలో తన సత్తాను చాటుకున్నారు. ఒకే పోటీలో ఇన్ని విభాగాల్లో విజయాలు సాధించడం విశేషమని నిర్వాహకులు పేర్కొన్నారు. వైశాలి సాధించిన ఈ ఘన విజయం పట్ల పోటీ నిర్వాహకులు, కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకే కాకుండా రాష్ట్రానికి కూడా మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైశాలి విజయం వలిగొండ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఆదర్శంగా, ప్రేరణగా నిలిచిందని కళాశాల వర్గాలు వెల్లడించాయి.

## ఎస్సీఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్2026 ఆవిష్కరణ



**హైద్రాబాద్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఎస్సీఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్2026ను గౌరవ అడ్లూరు లక్ష్మణ్ మంత్రివర్యులు తమ స్వహస్తాల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, విద్యారంగంలో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్లు సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం సాధనలో విద్య ప్రధాన ఆయుధమని, విద్యార్థులను సజ్జనులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ఇటువంటి క్యాలెండర్ల ద్వారా సామాజిక చైతన్యం మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ కోఆర్డినేటర్ రాపాక రవీందర్, జగిత్యాల జిల్లా ప్రెసిడెంట్ ఈ. రాజయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. శ్రీను, జిల్లా సెక్రటరీ జనయ్యతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. క్యాలెండర్ ద్వారా విద్యా విలువలు, సామాజిక అవగాహన, ప్రేరణాత్మక సందేశాలు ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

## నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

**విద్యార్థి సంఘాల ఆందోళన**




**వరంగల్, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని సెకండ్ గేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెయూ గ్రంథాలయం నుంచి సెకండ్ గేట్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్, ఎంఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, యువత విశ్వాసాన్ని పొందిందని అన్నారు. ఆ హామీలను నమ్మి నిరుద్యోగ యువత కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువచ్చినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేయించడం దుర్మార్గమని విమర్శించారు. నిరుద్యోగులను వాడుకుని గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి అధికార మదంతో విర్రవీగుతూ నిరుద్యోగుల రక్తాన్ని కళ్లతో చూస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్త నోటిఫికేషన్లు లేకపోవడంతో పాటు 'అభయహస్తం'లో ఇచ్చిన హామీలు అన్నీ నీటి బుడగలై మిగిలిపోయాయని అన్నారు. ప్రజా పాలన పేరిట ప్రజా వంచనకు పాల్పడుతున్న రేవంత్ సర్కారుకు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. నిర్బంధాలు మానుకుని, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులునిరుద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కెయూ అధ్యక్షులు అడ్డా రాజేష్, ప్రధాన కార్యదర్శి రాయరాల నరసింహ, ఉపాధ్యక్షులు చల్ల శ్రీకాంత్, ఉదయ్, సాయి, చంటి, కళ్యాణి, ప్రసన్న, అపర్ణ, కృష్ణ, వేణి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్
POWER OF PEOPLE

## శీతాకాలంలో చర్మ వ్యాధి: పెద్దల కంటే పిల్లలకు ఎక్కువ ప్రమాదం : మెడికవర్ డాక్టర్ల హెచ్చరిక




**బెంగళూరు వైట్‌ఫీల్డ్ జై భీమ్ న్యూస్ :**

శీతాకాలంలో సౌకర్యవంతమైన సీజన్‌గా పరిగణించబడుతున్నప్పటికీ, వైద్యుల అభిప్రాయం ప్రకారం, చల్లని వాతావరణం స్పష్టమైన లక్షణాలు లేకుండా చర్మానికి నిశ్శబ్ద నష్టాన్ని కలిగిస్తుంది. ఈ సమస్యలు నెమ్మదిగా పెరుగుతాయి మరియు తీవ్రమైన దశకు చేరుకున్నప్పుడు మాత్రమే గుర్తించబడతాయి. మెడికవర్ హాస్పిటల్‌లోని చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ రజిత అల్లూరి తెలిపిన ప్రకారం, తక్కువ తేమ, చల్లని గాలి, వేడి నీటి స్నానాలు, రూమ్ హీటర్లు మరియు ఎయిర్ కండిషనర్ల వాడకం చర్మం యొక్క సహజ రక్షణ పొరను బలహీనపరుస్తాయి. "కొంచెం కోత, చర్మం తెల్లబడటం సాధారణమైనదిగా విస్మరిస్తే, అది తామర, చర్మశోథ, చర్మ ఇన్ఫెక్షన్లు మరియు పగుళ్లకు దారితీస్తుంది" అని ఆమె హెచ్చరించారు. వైద్యుల అభిప్రాయం ప్రకారం, శీతాకాలంలో పిల్లల చర్మం పెద్దల కంటే త్వరగా దెబ్బతింటుంది. శిశు వైద్యురాలు డాక్టర్ లినాథ రెడ్డి తెలిపిన ప్రకారం, పిల్లల చర్మం యొక్క రక్షిత పొర సన్నగా ఉంటుంది మరియు త్వరగా తేమను కోల్పోతుంది. "పిల్లలలో తల్లిదండ్రులు తరచుగా పొడి చర్మాన్ని సాధారణమైనదిగా తోసిపుచ్చుతారు. కానీ చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇది ఇన్ఫెక్షన్లు, పగిలిన పెదవులు మరియు అలెర్జీ సమస్యలకు దారితీస్తుంది" అని ఆమె అన్నారు. చలి వాతావరణం, పొడి తరగతి గదులు, తరచుగా చేతులు కడుక్కోవడం మరియు సబ్బు మరియు శానిటైజర్లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల పాఠశాలకు వెళ్లే పిల్లలు ఈ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. శిశువులు మరియు చిన్నపిల్లలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతారు. క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్లను వాడటం,వేడి స్నానాలు పరిమితం చేయడం, తేలికపాటి క్లెన్సర్లను వాడటం, పుష్కలంగా నీరు త్రాగటం మరియు ముందుగానే వైద్య సలహా తీసుకోవాలని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు.

## పేదల ప్రాణాలకు భరోసా ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**సీఎంఆర్ఎఫ్ ద్వారా మరో కుటుంబానికి జీవనావకాశం**

**గుండె వ్యాధితో బాధపడుతున్న మహిళకు రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**హన్మకొండ, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

పేదల వైద్య అవసరాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందనడానికి మరో ఉదాహరణగా, ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు రూ. 2.50 లక్షల ఆర్థిక సహాయం అందింది. హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ పరిధిలోని హసన్ పర్తి గ్రామానికి చెందిన పిథిమి నాగమణి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎల్ఓసి కాపీని మంజూరు చేయించారు. ఈ ఎల్ఓసి కాపీని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఎల్ఓసి ద్వారా హైదరాబాద్‌లోని నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మెరుగైన వైద్యం పొందేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. స్థానిక శాసనసభ్యుడిగా తన పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయాన్ని తప్పకుండా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యం కోసం అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక ఆసుపత్రుల్లో సిఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఎల్ఓసిల సహాయంతో ఉచితంగా నాణ్యమైన చికిత్స పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆపద్కాలంలో తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకి బాధితురాలు పిథిమి నాగమణి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎఎంసి వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్, రాజు జన్ను, అశోక్ జన్ను, రమేష్ జన్ను, రామంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కండక్టర్ అప్రమత్తత.. వందల ప్రాణాలకు రక్షణ

**టీజీ ఆర్టీసీ బస్సులో తృటిలో తప్పిన పెను ప్రమాదం**


**హీరోగా నిలిచిన కాందారి సుధాకర్**

**హన్మకొండ, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఒక క్షణం ఆలస్యం జరిగితే వందల మంది ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్థితి అలాంటి అత్యంత కీలక ఘట్టంలో కండక్టర్ చూపిన అప్రమత్తత, సమయస్ఫూర్తి పెను ప్రమాదాన్ని అడ్డుకుంది. కమలాపూర్ మండలం అంబాల గ్రామ సమీపంలో హన్మకొండ డిపోకు చెందిన హన్మకొండ గోదావరిఖని మార్గంలో ప్రయాణిస్తున్న టీజీ ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయి వెళ్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బస్సు ముందు భాగంలోని టైర్‌కు సంబంధించిన మూడు బోల్టులు పూర్తిగా విరిగిపోయిన అత్యంత ప్రమాదకర స్థితిని కండక్టర్ కాందారి సుధాకర్ ప్రయాణం మధ్యలోనే గుర్తించడం ద్వారా పెను విపత్తు తప్పింది. వేగంగా సాగుతున్న బస్సులో ఎవరికీ కనిపించని ఈ సాంకేతిక లోపాన్ని సుధాకర్ తన అనుభవం, విధి పట్ల ఉన్న నిబద్ధతతో గుర్తించారు. టైర్ వైపు నుంచి వస్తున్న అసాధారణ శబ్దం, కంపనాన్ని గమనించిన వెంటనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకొని ఏమాత్రం ఆలస్యం చేయకుండా డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. డ్రైవర్ కూడా సుధాకర్ సూచనలతో బస్సును వెంటనే రోడ్డుపై సురక్షితంగా పక్కకు నిలిపివేశారు. ఈ సమయంలో ప్రయాణికుల్లో ఎలాంటి భయం, గందరగోళం కలగకుండా సుధాకర్ పూర్తి నియంత్రణతో వ్యవహరించారు. ప్రయాణికులను శాంతింపజేస్తూ, పరిస్థితిని స్పష్టంగా వివరించారు. వెంటనే హన్మకొండ డిపో అధికారులకు సమాచారం అందించగా, వారు తక్షణమే స్పందించి సాంకేతిక సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించారు. పరిశీలనలో టైర్ పూర్తిగా విడిపోయే స్థితిలో ఉందని, మరో కొద్దిసేపు బస్సు నడిచినా తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉందని అధికారులు నిర్ధారించారు. వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులకు ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మరమ్మత్తులు చేపట్టారు. కండక్టర్ సుధాకర్ చూపిన సమయస్ఫూర్తి వల్ల వందలాది ప్రయాణికుల ప్రాణాలు సురక్షితంగా నిలిచాయి. చిన్న నిర్లక్ష్యం జరిగినా భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశమున్న ఈ ఘటనలో ఆయన చూపిన అప్రమత్తత ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ, "బస్సు నడుస్తున్న సమయంలో ఇలాంటి లోపాన్ని గుర్తించడం చాలా అరుదైన విషయం. సుధాకర్ కేవలం తన విధి మాత్రమే కాకుండా, మా ప్రాణాలపై బాధ్యత తీసుకుని వ్యవహరించారు. ఆయన నిజమైన హీరో. ఇలాంటి ఉద్యోగులే ఆర్టీసీకి నిజమైన బలం" అని పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం స్థానికులు, ప్రయాణికులు మాత్రమే కాకుండా ఆర్టీసీ అధికారులు, సహోద్యోగులు కూడా సుధాకర్‌ను అభినందించారు. ప్రజల ప్రాణభద్రతే లక్ష్యంగా, ప్రాణాలకంటే విధిని ముఖ్యంగా భావిస్తూ సేవలందిస్తున్న సుధాకర్ వంటి ఉద్యోగులు టీజీ ఆర్టీసీకి గర్వకారణమని వారు వ్యాఖ్యానించారు. ప్రయాణికుల భద్రత కోసం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రమాదాన్ని ముందే అడ్డుకున్న ఈ ఘటన మరోసారి ఆర్టీసీ ఉద్యోగుల సేవా నిబద్ధతను చాటిందని పలువురు అభిప్రాయపడ్డారు.




# అభివృద్ధికి వేగం పెంచాలి.. జాప్యానికి తావు లేదు





**ఎంపీ నిధుల రూ.8.30 కోట్ల పనులు మూడు నెలల్లో ప్రారంభించాలి : వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**హన్మకొండ, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేసేలా వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎంపీ ఛాంబర్‌లో చీఫ్ ప్లానింగ్ (సిపిఓ) అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎంపీ నిధుల నుండి మొత్తం రూ. 8 కోట్ల 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల లోపు పనులు ప్రారంభించాల్సిందేనని, లేనిపక్షంలో ఆ పనులను రద్దు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎంపీ నిధుల ద్వారా చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పురోగతి వివరాలు తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా పారదర్శకత పాటించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి టెక్నికల్ సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే కార్యక్రమాలను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఎంపీ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మారామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారి కిషన్, డిడబ్ల్యుఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట





**ఇందిరమ్మ ఇండ్లు, గోదావరి జలాలు, మౌలిక వసతులతో నియోజకవర్గానికి కొత్త దిశ : మంత్రి సీతక్క**

**ములుగు, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వెనుకబడిన ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలం జీవాంతరావు పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇల్లు, రూ. 5 లక్షలతో నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రహరీ గోడ, అలాగే రూ. 3 కోట్ల 50 లక్షలతో పీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో ములుగు నుంచి గణేష్‌పల్లి (వయా జీవాంతరావు పల్లి) వరకు నిర్మించిన డబుల్ లైన్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ములుగు నియోజకవర్గానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయానని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ములుగు ప్రాంతంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం తన బాధ్యత అని, ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సమ్మక్కసారక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టులు ఉన్నప్పటికీ గత పాలకులు గోదావరి జలాలను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు తరలించలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాలను ప్రతి గ్రామానికి తరలించి రెండు పంటలు పండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. దీనిలో భాగంగా మేడారంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో రూ. 143 కోట్లతో లిఫ్ట్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, అలాగే రామప్ప నుంచి లక్నవరం సరస్సుకు గోదావరి జలాల తరలింపుకు రూ. 35 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం భక్తులు, పర్యాటకులు మేడారం, రామప్పకు చేరుకోవడానికి చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఈ ఇబ్బందులు తొలగించేందుకు ములుగు నుంచి నేరుగా రామప్పకు వెళ్లేలా రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా రామప్ప సరస్సులో రూ. 13 కోట్లతో ఐలాండ్ నిర్మించి శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మేడారం మహాజాతరను పురస్కరించుకొని మహిళా సంఘాలకు చెందిన 560 మందికి ఆర్థిక సహాయం అందించి వివిధ వ్యాపారాలు ప్రారంభించే అవకాశం కల్పించామని చెప్పారు. వెనుకబడిన ములుగు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన నిరంతర లక్ష్యమని పేర్కొంటూ, నాయకుడు అనే వ్యక్తి గెలిచినవారికే కాదు ఓడినవారితో కూడా కలిసి ప్రజల మధ్య ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడారం పరిరక్షణే ధ్యేయం

**22 భాషల భారీ బ్యానర్‌తో హనుమకొండలో వినూత్న అవగాహన ర్యాలీ**

**హన్మకొండ, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర పవిత్రతను కాపాడడం, అక్కడి అటవీ సంపదను పరిరక్షించడం లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ సంస్థ (వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వినూత్న అవగాహన ర్యాలీతో పాటు ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, సామాజికవేత్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్. భద్ర, జాతీయ కార్యదర్శి సాగర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో రూపొందించిన భారీ క్లాత్ బ్యానర్ ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పర్యావరణానికి హానికరం కాని వస్త్రంతో రూపొందించిన ఈ బ్యానర్‌పై ప్లాస్టిక్ రహిత మేడారం అడవిని కాపాడుదాం అనే నినాదాలు రాయడం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, మేడారం వంటి పవిత్ర అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు భక్తుల స్వచ్ఛంద సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఇలాంటి వినూత్న అవగాహన కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడువాయి మండలంలో జరగనున్న ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఆధ్యాత్మిక సమాగమమైన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను పూర్తిగా 'ప్లాస్టిక్ రహిత' జాతరగా నిర్వహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. భక్తులు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు అడవిలో వదిలివేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ సి.హెచ్. భద్ర మాట్లాడుతూ, గత 14 సంవత్సరాలుగా తమ సంస్థ మేడారంలో ప్లాస్టిక్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈసారి జాతరకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో, పర్యావరణానికి హాని చేయని వస్త్రంతో 22 భాషల్లో నినాదాలు రాసిన భారీ బ్యానర్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది భవిష్యత్తులో మేడారం పరిరక్షణ ఉద్యమానికి చారిత్రాత్మక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. సామాజికవేత్త ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఈసారి జాతరకు సుమారు 2.5 నుంచి 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఒక్కో భక్తుడు సగటున 10 నుంచి 20 ప్లాస్టిక్ కవర్లు లేదా బాటిళ్లు వాడితే 10 నుంచి 15 కోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు అడవిలో చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది మేడారం అటవీ ప్రాంతాన్ని తీవ్రమైన కాలుష్య కాసారంగా మార్చే ప్రమాదం ఉందని పేర్కొంటూ, భక్తులు ప్లాస్టిక్‌ను పూర్తిగా త్యజించి అడవి తల్లిని కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవగాహన ర్యాలీలో కాకతీయ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని "సేవ్ మేడారం క్లీన్ మేడారం గ్రీన్ మేడారం" అంటూ నినాదాలు చేయడంతో కలెక్టరేట్ పరిసర ప్రాంతం పర్యావరణ సందేశంతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పిట్టల వెంకన్న, ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ పటేల్, జాతీయ యువజన కార్యదర్శి సుమేర్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల రాంప్రసాద్, దయాప్రసాద్, సామాజిక కార్యకర్త చంద్రప్రకాష్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజ్, రోషన్ గైక్వాడ్, బాగడి రమేష్, అనికేత్, సంస్థ అంబాసిడర్ అద్విత్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డైరీ ఆవిష్కరణ

**జర్నలిజం సమాజానికి వారధి : జిల్లా కలెక్టర్ సత్య శారద**

**వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జర్నలిస్టులలో ఉత్సాహాన్ని నింపుతూ, బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రాధాన్యతను మరోసారి చాటింది. డైరీని ఆవిష్కరించిన అనంతరం జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వానికి మరియు సమాజానికి మధ్య బలమైన వారధిగా జర్నలిజం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక స్థంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర అనిర్వచనీయమని అన్నారు. అందుకే మెరుగైన జర్నలిజం కోసం జర్నలిస్టు యూనియన్లు మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇటువంటి డైరీలు జర్నలిస్టులకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించడమే కాకుండా, వారి దైనందిన వృత్తి జీవితంలో మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. తన చేతుల మీదుగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డైరీని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది తనకు ప్రత్యేక సంతృప్తినిచ్చిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. సుదీర్ఘ చరిత్ర, విలువలతో కూడిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, స్వేచ్ఛల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఐజేయూ సేవలు రాబోయే కాలంలో సమాజానికి మరింతగా దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నైతిక విలువలతో కూడిన జర్నలిజం అవసరమని, అటువంటి జర్నలిజాన్ని ప్రోత్సహించడంలో తానూ ముందువరుసలో ఉంటానని జిల్లా కలెక్టర్ సత్య శారద భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరాం రాంచందర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రత, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వరంగల్ జిల్లాలో జర్నలిజాన్ని మరింత నాణ్యతతో ముందుకు తీసుకెళ్లేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ డైరీ జర్నలిస్టులకు దైనందిన అవసరాలకు ఉపయోగపడే విధంగా రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శులు బొమ్మగాని సతీష్ కుమార్, చింత నూరి రాజు, బాదవత్ బాలాజీ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు కందుల శ్రీధర్, జిల్లా నాయకులు పిన్న శివకుమార్, మహేష్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగింపులో జర్నలిస్టుల మధ్య ఐక్యత, వృత్తి పట్ల నిబద్ధత మరింత బలోపేతం కావాలని పాల్గొన్నవారు ఆకాంక్షించారు.



# ఫైరింగ్ సాధనలో పాల్గొన్న పోలీస్ అధికారులు

**వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వార్షిక ఫైరింగ్ సాధన కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి చెందిన పోలీస్ సిబ్బందితో పాటు శాంతిభద్రతల విభాగానికి చెందిన పోలీస్ అధికారులు గత రెండు రోజులుగా ధర్మసాగర్ మండల కేంద్ర శివారులోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫైరింగ్ రేంజ్?లో ఫైరింగ్ సాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్?ప్రీత్ సింగ్తో పాటు డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్?.ఐలు, ఇన్?స్పెక్టర్లు, ఎస్?.ఐలు పాల్గొని వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని ఫైరింగ్ సాధనకు మరింత అనుకూలంగా అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫైరింగ్ సాధనలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి తగిన రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీలు చేతన్, శుభం, ట్రైనీ ఐపీఎస్ మనిషా నెహ్రా, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, రాయల ప్రభాకర్ రావు, శ్రీనివాస్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.





# మినీ బ్రహ్మోత్సవం.. తిరుమలలో రథసప్తమికి సర్వం సిద్ధం

**జనవరి 25న తిరుమలలో రథసప్తమి వేడుకలు**
**సామాన్య భక్తుల కోసం అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు**
**ఒకే రోజులో ఉదయం నుంచి రాత్రి వరకు 8 వాహన సేవలు**
**భక్తుల సౌకర్యార్థం భారీగా అన్నప్రసాదం, భద్రతా ఏర్పాట్లు**
**జనవరి 24 నుంచి 26 వరకు సర్వదర్శనం టోకెన్ల జారీ నిలిపివేత**

**తిరుపతి, జై భీమ్ న్యూస్**

ఒకే రోజులో జరిగే మినీ బ్రహ్మోత్సవంగా భావించే రథసప్తమి వేడుకలకు తిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జనవరి 25న జరగనున్న ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. వేడుకల రోజున అన్ని రకాల ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రథసప్తమి సందర్భంగా ఒకే రోజులో శ్రీ మలయప్ప స్వామి వారు ఎనిమిది వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఉదయం సూర్యప్రభ వాహనంతో సేవలు ప్రారంభమై, రాత్రి చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయి. ఈ వేడుకలను వీక్షించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనవరి 24 నుంచి 26 వరకు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీని కూడా నిలిపివేశారు. భక్తుల సౌకర్యార్థం 85 కౌంటర్ల ద్వారా 14 రకాల అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. భద్రత కోసం 1300 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందిని మోహరించారు. భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ 2300 ప్రత్యేక ట్రిప్పులు నడపనుండగా, మెరుగైన పారిశుద్ధ్య చర్యలు, వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఈ వేడుకలను 1000 మంది కళాకారులతో 56 రకాల కళారూపాల ప్రదర్శనలతో మరింత శోభాయమానంగా మార్చనున్నారు. ఈ ఉత్సవాలను ఎస్వీబీసీ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ, టీటీడీ సూచనలను అనుసరించి స్వామివారి వాహన సేవలను వీక్షించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వరంగల్ జిల్లాలో జాబ్ మేళా నిర్వహణ

**24న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగావకాశాలు**

**వరంగల్, 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణా ప్రభుత్వము
ఉపాధి కల్పన మరియు శిక్షణా శాఖ

జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం,
వరంగల్ జిల్లా

తేది :- 22.01.2026

జాబ్ మేళ పత్రిక ప్రకటన

వరంగల్ జిల్లా లోని నిరుద్యో యువతీ యువకు లకు తెలియ జేయునది ఏమనగ Private Companys తేది 24.01.2026(శని శవారం) రోజున ములుగు రోడ్ ప్రభుత్వ ఐ.టి.ఐ క్యాంపస్ వద్ద ఉన్న జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నందు జాబ్ మేళా(Private Jobs) నిర్వహిస్తున్నము. ఈ సదవకాశాన్ని 18 సం: నుండి 30 : సంవత్సరాల మధ్య గల SSC/ Inter/ degree నిరుద్యో యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సాత్విక, గారు తెలిపినారు

కంపెనీ పేరు విద్యార్హతలుమరియు వివరములు

| Sl.No | NAME OF THE COMPANY | job Role | Salary | No.of vacancy | AGE | Qualification | Job Location |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Pay tm Company | Field Officers | 20,000/- to 25,000/- Bike & Smart Phone Mandatory | 50 | 18-35 | SSC to Degree | Hanumakonda |
| 2 | Satin Finance Hanumakonda | Field Sales Executive | 20,000/- Bike Mandatory | 10 | 18-30 | | Warangal Hanumakonda |
| 3 | Fine Free Hanumakonda | Tele callers & Sales EXECUTIVE | 13,000/- 20,0000/- | 10 | | | |
| 4 | Vijaya Fertilzers Warangal | Sales EXECUTIVE | 15,000/- Free Food & Accommodation | 10 | | | |
| 5 | Druvanth Solutions Hanumakonda | Tele callers | Tele callers | 10 | | | |
| 6 | Kaptson Hyd | IT Assets Operation | 20,000/- to 25,000/- | 10 | | | Hydarabad Gachibowli |

అర్హత మరియుఆసక్తి గల ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువకులు తమ బయోడాటా లేదా రెస్యూములతో పాటు, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపిలతో ఉదయం11:00 గం. నుండి మధ్యాహ్నం 2 గం.వరకుతేదీ24.01.2026(శనివారం) రోజునVENUE:DISTRICT EMPLOYMENT EXCHANGE WARANGAL GOVT ITI (Boys) Mulugu Road ,Hanumakondaజరుగు జాబ్ మేళాకు హాజరు కావలసిందిగా కోరుతున్నారు. For More Details Follows " Instagram Page" dee_warangal_

జిల్లా ఉపాధి కల్పనా అధికారి,
District Employment Officer
WARANGAL


దిని ప్రతి శ్రీయుత ఉప సందాలకులు ,జిల్లా పౌర సంభందాల శాఖ అధికారి కార్యాలయం ,వరంగల్ జిల్లా గారికి సమర్పిస్తున్న అన్ని దిన పత్రికలలో ప్రకటించుట కు కోరనైనది

వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. ఈ జాబ్ మేళా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఐటీఐ (బాయ్స్), ములుగు రోడ్, హనుమకొండలో జరుగనుంది. ఈ జాబ్ మేళాలో పేటీఎం, సతిన్ ఫైనాన్స్, ఫైన్ ఫ్రీ, విజయ ఫర్టిలైజర్స్, ద్రువంత్ సొల్యూషన్స్, కాప్టన్ హైడ్ వంటి ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొననున్నాయి. ఫీల్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఐటీ అసెట్స్ ఆపరేషన్ వంటి వివిధ పోస్టుల కోసం నియామకాలు చేపట్టనున్నారు. ఈ ఉద్యోగాలకు అర్హతగా ఎస్ఎస్సి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన యువత దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13,000 నుంచి రూ.25,000 వరకు జీతం, కొన్ని పోస్టులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కొన్ని ఉద్యోగాలకు బైక్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. హనుమకొండ, వరంగల్‌తో పాటు హైదరాబాద్ (గచ్చిబౌలి) ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాలు జరుగనున్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్ కార్డు, ఫోటోలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని లేదా »»dee_warangal_µµ ఇన్‌స్టాగ్రామ్ పేజీని సంప్రదించాలని అధికారులు కోరారు.

# ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను కలిసిన కానిస్టేబుల్ జయశాంతి

**విధి పట్ల అంకితభావానికి గౌరవంగా కుటుంబంతో కలిసి ఆహ్వానించి సత్కరించిన మంత్రి**

**విజయవాడ(ఆంధ్ర ప్రదేశ్), 22 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



రంగంపేటకు చెందిన కానిస్టేబుల్ జయశాంతి గురువారం ఉదయం విజయవాడలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత జయశాంతితో పాటు ఆమె కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఆహ్వానించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కానిస్టేబుల్ జయశాంతి విధి నిర్వహణలో భాగంగా కాకపోయినా, చిన్న బిడ్డను చంకనెత్తుకుని ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రజల భద్రతకు కృషి చేసిన దృశ్యం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. విధి పట్ల ఆమె చూపిన అంకితభావం, బాధ్యతా భావం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడమే కాకుండా, ప్రజల్లో పోలీసు వ్యవస్థపై గౌరవాన్ని మరింత పెంచింది. ఈ విషయం తెలుసుకున్న ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత రెండు రోజుల క్రితం కానిస్టేబుల్ జయశాంతికి ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో ఆమె చూపిన నిబద్ధత, మానవీయ కోణాన్ని మంత్రి కొనియాడారు. ఆ సందర్భంగా మంత్రిని ప్రత్యక్షంగా కలవాలనే తన ఆకాంక్షను జయశాంతి వ్యక్తం చేయగా, మంత్రి అనిత సానుకూలంగా స్పందించి ఆమెను విజయవాడకు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం జయశాంతి కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడకు చేరుకొని హోంమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత జయశాంతితో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం ఆమె కుటుంబ పరిస్థితులు, పిల్లల చదువు, ఆరోగ్యం తదితర విషయాలను ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. జయశాంతి పిల్లలతో మంత్రి అనిత సరదాగా ముచ్చటిస్తూ, వారికి స్ఫూర్తినిచ్చేలా మాటలు చెప్పారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ జయశాంతి కుటుంబ సభ్యులను మంత్రి ఘనంగా సత్కరించారు. విధి పట్ల నిబద్ధత, బాధ్యత, మానవీయత కలిసినప్పుడు పోలీసు సేవలకు మరింత గౌరవం లభిస్తుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. హోంమంత్రిని ప్రత్యక్షంగా కలవడం, తన సేవలను గుర్తించి గౌరవించడం పట్ల కానిస్టేబుల్ జయశాంతి ఆనందం వ్యక్తం చేశారు. తనపై చూపిన ఆప్యాయతకు, ప్రోత్సాహానికి మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటన పోలీస్ సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, విధి నిర్వహణలో అంకితభావం ఎంత ముఖ్యమో మరోసారి చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఆక్రమణలపై హైడ్రా కొరడా... ఒకే రోజు రెండు చోట్ల చర్యలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో చర్యలు చేపట్టింది. గచ్చిబౌలిలో ఓ విలువైన పార్కు స్థలాన్ని కాపాడగా, శామీర్‌పేటలో ఏళ్లుగా మూతపడిన రహదారికి విముక్తి కల్పించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 1982 నాటి లేఅవుట్‌లో 4000 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఇందులో 1500 గజాలు ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలిశాయి. మిగిలిన 2500 గజాల స్థలాన్ని కూడా కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. లేఅవుట్ ప్రకారం అది పార్కు స్థలమని నిర్ధారించుకుని, 2500 గజాల స్థలంలోని ఆక్రమణలను తొలగించారు. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఫెన్సింగ్ వేసి, 'పార్క్ స్థలం' అని బోర్డును ఏర్పాటు చేశారు. మరో ఘటనలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీలోనూ హైడ్రా చర్యలు చేపట్టింది. 1987 నాటి లేఅవుట్‌లోని 20 అడుగుల రోడ్డును కొందరు ఆక్రమించి గోడలు, గేటు నిర్మించారు.

# ఎర్రబెల్లి పగటి కలలు మానుకో

**ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు దయాకర్ రావును పిలిచి బట్టలు పెడతాం**
**మున్సిపాలిటీపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే**
**100 పడకల ఆసుపత్రిపై ఎర్రబెల్లి మాటలు పచ్చి అబద్ధాలు**
**వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు**




**వర్ధన్నపేట : (జై భీమ్ న్యూస్)**

త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు తీవ్రంగా ఖండించారు.గురువారం వర్ధన్నపేటలో విలేకరులతో మాట్లాడారు...గత బీఆర?స్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని శేఖర్ రావు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి, గృహప్రవేశ కార్యక్రమాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లిని ముఖ్య అతిథిగా పిలుస్తామన్నారు.ఎర్రబెల్లికి నూతన వస్త్రాలు పెట్టి మరీ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూపిస్తామని ఎద్దేవా చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నది ఇందిరమ్మ రాజ్యమేనని స్పష్టం చేశారు.వర్ధన్నపేటలో 100 పడకల ఆసుపత్రి దారి మళ్లుతోందన్న వార్తల్లో ఏమాత్రం నిజంలేదని, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో భూకేటాయింపుల్లో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్ది, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా శాశ్వత ప్రాతిపదికన ఆసుపత్రిని నిర్మిస్తున్నామని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని ఎర్రబెల్లి, ఇప్పుడు రాజకీయ ఉనికి కోసం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపాలిటీపై హస్తం జెండా ఖాయం 12 వార్డులకు 12 గెలుస్తామని బీఆర?స్ నాయకులు చెప్పుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని, వర్ధన్నపేట మున్సిపాలిటీపై ఎగిరేది కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండానే అని శేఖర్ రావు ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మర్చిపోలేదని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర?స్?కు చెంపదెబ్బ తప్పదని హెచ్చరించారు. ఎవరో కొందరు పాత నాయకులకు కండువాలు కప్పినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఉన్న కాంగ్రెస్ బలాన్ని తగ్గించలేరని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, చిటూరి అశోక్ ,అనిమిరెడ్డి కృష్ణారెడ్డి ,మైస సురేష్ కుమార్ తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎదుటివారి కోసం మన ఇష్టాలను చంపుకోవద్దు: ఐశ్వర్యరాయ్

**మహిళలకు అతి పెద్ద ఆయుధం 'గొంతుక' అన్న ఐశ్వర్య**
**మన విలువలకు వ్యతిరేకంగా ఉన్నవాటిని తిరస్కరించాలని సూచన**
**మనకంటూ కొన్ని హద్దులు గీసుకోవాలంటూ సలహా**



మహిళలకు ఉన్న అతిపెద్ద ఆయుధం 'గొంతుక' అని బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ అన్నారు. ఏదైనా నచ్చనప్పుడు నిర్మొహమాటంగా మన అభిప్రాయాలను వెల్లడించడమే మన శక్తి అని చెప్పారు. ఇంట్లో కానీ, ఆఫీసులో కానీ ఎదుటివారి కోసం మన ఇష్టాలను చంపుకోవడం సరైన పద్ధతి కాదని సూచించారు. కేవలం విజయాలను సాధించడం మాత్రమే కాదు... మన విలువలకు వ్యతిరేకంగా ఉన్న వాటిని తిరస్కరించడం కూడా గొప్ప విషయమేనని చెప్పారు. మనకు నచ్చని విషయాలకు 'నో' చెప్పడం వల్ల మన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఐశ్వర్య అన్నారు. అది మానసిక ప్రశాంతతకు ఎంతో మేలు చేస్తుందని... ఇదే విషయాన్ని సైకాలజిస్టులు కూడా చెబుతున్నారని తెలిపారు. ఇష్టం లేకపోయినా ప్రతిదానికి 'అవును' అంటూ తలలూపడం వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. మనకంటూ కొన్ని హద్దులను గీసుకున్నప్పుడే ఎదుటి వారి నుంచి మనకు గౌరవం పెరుగుతుందని చెప్పారు. ఆత్మవిశ్వాసంతో మన అభిప్రాయాలను వెల్లడించాలని... అది మీ ఎదుగుదలకు తొలి మెట్టు అవుతుందని తెలిపారు. ప్రతి విషయాన్ని సవాల్ గా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

# పెట్టుబడిదారీ విధానాల వల్లే అసమానతలు

**శాస్త్రీయ సమాజ మార్పుకు మార్గదర్శి మార్క్సిజం**
**ఎంసిపిఐ(యు) రాష్ట్ర క్లాసుల ప్రారంభోత్సవంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**






**గిర్నిబావి, జనవరి 22, 2026(జై భీమ్ న్యూస్)**

సమాజ పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన ఏకైక సిద్ధాంతం మార్క్సిజమేనని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) -- ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి పేర్కొన్నారు. పెట్టుబడిదారీ పాలకుల విధానాల కారణంగానే దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా దోపిడీకి గురవుతున్న శ్రామిక వర్గాల ఐక్యతతో ప్రజా పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఎంసిపిఐ(యు) రాష్ట్రస్థాయి సైద్ధాంతిక--రాజకీయ శిక్షణ తరగతులు గురువారం గిర్ని బావిలోని జి.ఆర్.బి. కన్వెన్షన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వంగల రాగసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ముందుగా పార్టీ జెండాను పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వల్లెపు ఉపేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులను ప్రారంభిస్తూ కామ్రేడ్ గాదగోని రవి మాట్లాడుతూ, దేశంలో కుల, మత, ప్రాంతీయ, ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిమంది చేతుల్లో అపారమైన సంపద కేంద్రీకృతమవుతుండగా, శ్రామికులు ఎంత కష్టపడినా కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితి నెలకొందని తెలిపారు. దోపిడీ పెరుగుతున్న కొద్దీ ప్రజల మౌలిక సదుపాయాలు క్షీణిస్తున్నాయని, నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ రాజకీయాలతో ప్రజలను తాత్కాలిక ప్రలోభాలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారులతో చేతులు కలిపి ప్రజల సంపదను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులను కార్ల్ మార్క్స్ ముందే అంచనా వేసి మార్క్సిజాన్ని రచించారని, పెట్టుబడిదారీ వ్యవస్థ తన గొయ్యిని తానే తవ్వుకుంటుందన్న మార్క్స్ వ్యాఖ్యలు నేటి సమాజంలో అక్షరాలా నిజమవుతున్నాయని అన్నారు. ప్రజా ఉద్యమాలు బలపడకుండా అస్తిత్వ ఉద్యమాలను ప్రోత్సహిస్తూ, నిర్బంధాన్ని ఆయుధంగా మార్చుకుని పాలకులు అధికారాన్ని నిలుపుకుంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సమాజ పరిణామ క్రమాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకుని, వర్గ--సామాజిక ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసే కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2026 పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ - ఈ కార్యక్రమంలో పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను సీనియర్ నాయకులు కామ్రేడ్ కోట నరసింహారెడ్డి, వల్లెపు ఉపేందర్ రెడ్డి, నాగెల్లి కొమురయ్యలతో పాటు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.రెడ్డి, హంస రెడ్డి, కుంభం సుకన్య, తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబురావు, కనకం సంధ్య, తుడుం అనిల్ కుమార్, జబ్బర్ నాయక్, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర దానయ్య, నర్ర ప్రతాప్, జిల్లా నాయకులు మాలోత్ సాగర్, చుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామిలతో కలిసి ఆవిష్కరించారు. తొలి రోజు శిక్షణ తరగతిలో "మార్క్సిజం -- అధ్యయనం, ఆచరణ : ఓంకార్ పాత్ర" అనే అంశంపై పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వల్లెపు ఉపేందర్ రెడ్డి బోధించారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.

# హసన్‌పర్తి మండల సర్పంచులకు పోలీస్ స్టేషన్‌లో రోడ్డు భద్రత అవగాహన సదస్సు






**హాజరైన మండల సర్పంచులు, ఉపసర్పంచులు**
**ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణ రక్షణ - ఇన్స్పెక్టర్ వట్టే చేరాలు**

**హసన్‌పర్తి, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్):**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా రోడ్డు భద్రత అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, వాహనదారులు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వట్టే చేరాలు మాట్లాడుతూ, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి కారణాల వల్లే అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. పాదచారుల భద్రత దృష్ట్యా జీబ్రా క్రాసింగ్‌ల వినియోగం తప్పనిసరి అని, రాత్రి వేళ రిఫ్లెక్టర్‌లు ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అలాగే గ్రామ సర్పంచులు ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వాహన రిజిస్ట్రేషన్, హెల్మెట్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా నిరోధించడంతో పాటు గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు చేపట్టాలని ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను పాటించినప్పుడే కుటుంబాలకు సురక్షితమైన భవిష్యత్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ, గ్రామాలలో అక్రమంగా కొనసాగుతున్న బెల్టు షాపుల నిర్వహణపై కఠిన చర్యలు చేపట్టాలని, ప్రజా భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణను పటిష్టం చేయాలని కోరారు. అలాగే మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు, రోడ్డు భద్రత పరిరక్షణకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని సర్పంచులు తెలిపారు. ఈ సదస్సులో ఎస్ఐలు దేవేందర్, శీలం రవి, సుజిత్ రెడ్డిలతో పాటు హసన్‌పర్తి మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గంటూరుపల్లి సర్పంచ్ చల్లా రాకేష్ రెడ్డి, సీతంపేట సర్పంచ్ మేక రమ్య భగవాన్ రెడ్డి, నాగారం సర్పంచ్ సందరాజు లావణ్య సంతోష్, పెంబర్తి సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, అనంతసాగర్ రామంచ వెన్నెల దయాకర్, జయగిరి సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, మడిపల్లి సర్పంచ్ బుర్ర రంజిత్ కుమార్, సుధానపల్లి సర్పంచ్ ఆకారపు లక్ష్మి లింగస్వామి, బైరాన్‌పల్లి సర్పంచ్ కళ్లెబోయిన సురేందర్, హెచ్‌సీ ఎన్ తండా సర్పంచ్ భూక్యా దేవేందర్, అర్వపల్లి సర్పంచ్ అంబాల ప్రభాకర్, సిద్దాపూర్ సర్పంచ్ బొక్క హరీష్, కొత్తపల్లి సర్పంచ్ దండ్రి సాంబయ్య, మల్లారెడ్డిపల్లి సర్పంచ్ గాజు కృష్ణవేణి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తాను ప్రేమలో ఉన్నట్లు ప్రకటించిన హీరోయిన్ ఫరియా అబ్దుల్లా



'జాతి రత్నాలు' సినిమాతో స్టార్‌డమ్ దక్కించుకున్న హైదరాబాదీ భామ ఫరియా అబ్దుల్లా ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటన, డ్యాన్స్, ర్యాప్ సాంగ్స్‌తో మల్టీ టాలెంటెడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. తాజాగా తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా, తాను ప్రస్తుతం ప్రేమలో ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఒక హిందూ అబ్బాయితో డేటింగ్ చేస్తున్నానని, ఇండస్ట్రీలో ఉంటూనే కెరీర్‌వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడంలో తన ప్రియుడి మద్దతు ఎంతో కీలకమని వెల్లడించారు. ఫరియా మనసు దోచుకున్న ఆ వ్యక్తి సినీ పరిశ్రమకు చెందిన యంగ్ కొరియోగ్రాఫర్ కావడం విశేషం. ఇద్దరూ కలిసి పని చేస్తున్నామని, తనలోని డ్యాన్స్, మ్యూజిక్ టాలెంట్‌ను బయటకు తీసుకురావడంలో అతని పాత్ర చాలా ఉందని ఫరియా తెలిపారు. మతభేదాలపై వస్తున్న ప్రశ్నలకు కూడా ఆమె స్పష్టతనిచ్చారు. తాను ముస్లింను అయినప్పటికీ, హిందూ యువకుడితో ఉన్న ఈ బంధాన్ని కేవలం లవ్ అఫైర్‌గా చూడట్లేదని, ఇది ఒక బలమైన పార్ట్‌నర్‌షిప్ అని చెప్పారు. వరుస సినిమాలతో కెరీర్‌లో జోరు కొనసాగిస్తున్న ఫరియా.. తన ప్రేమ, వ్యక్తిగత జీవితంపై చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.